## క్లుప్తంగా

### సీఎం జగన్ సారథ్యంలోనే గిరిజనులకు సముచిత స్థానం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే గిరిజనులకు సముచిత స్థానం దక్కిందని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి తోకల చిన వీరోజి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మానుపాటి నవీన్‌ను చిన వీరోజి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవీన్‌ను వీరోజి శాలువాతో సత్కరించి, పూల మొక్కను బహుకరించారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్‌ను నవీన్ నెలకొల్పి, రాష్ట్ర నలుమూలల ఉన్న గిరిజనులను ఏకతాటిపైకి తీసుకువచ్చారని, వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారికి ఏ అండగా నిలిచారన్నారు. గిరిజనులకు నిత్యం అందుబాటులో ఉండే నవీన్‌ను ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

### స్పందన కార్యక్రమం రద్దు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, నగరంలోని జోనల్ కమిషనర్ కార్యాలయాలు, సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

### అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు ఏమైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్‌జోన్ ఏసీపీ హరికృష్ణ హెచ్చరించారు. వెస్ట్‌జోన్ పరిధిలోని రౌడీషీటర్లకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ హరికృష్ణ మాట్లాడుతూ.. త్వరలో ఎన్నికలు జరగనున్నాయన్నారు. అందులో రౌడీషీటర్లు ఎటువంటి సంఘ విద్రోహ చర్యలకు పాల్పడిన సహించబోమన్నారు. అంతేకాకుండా శాంతియుత వాతావరణం కొనసాగే విధంగా అందరూ సహకరించాలని కోరారు. ఎక్కడా గొడవలు, అల్లర్లు కలిగించకుండా ఉండాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, సీఐలు దుర్గాశేఖర్‌రెడ్డి, గణేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని డీసీపీ హరికృష్ణ తెలిపారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పారామిలటరీ, సివిల్ పోలీసులు ఆదివారం మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. బైపాస్ రోడ్డు , కబేళా తదితర ప్రాంతాల్లో బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు గాను ముందస్తు చర్యల్లో భాగంగా పారా మిలటరీ బలగాలు, సివిల్ పోలీస్ కవాతు నిర్వహించాయని పేర్కొన్నారు. వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి , వెస్ట్ డివిజన్ సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### 24న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడకల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24 వ తేదీ ఆదివారం సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తునట్లు ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకట దశరథ రమేష్, అధ్యక్షుడు డాక్టర్ బీవీ గురునాథశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆహ్లాదకరం.. కృష్ణమ్మ జలవిహార్ పార్క్




నగరంలోని వారధి వద్ద నూతనంగా ప్రారంభించిన కృష్ణమ్మ జలవిహార్ పార్క్‌లో సందర్శకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో నగర వాసులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆహ్లాదంగా గడిపారు. కృష్ణా నది ఒడ్డున చల్లటి వాతావరణంలో సేదతీరారు. రివర్ ఫ్రంట్ పార్క్ బోర్డు, సింహం విగ్రహాల వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకుంటూ మురిసిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ










# గడప వద్దకే ప్రభుత్వ పథకాలు

**పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్**



వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న షేక్ ఆసిఫ్, కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానీపురంలోని 40వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఆంజనేయరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా అవ్వా, తాతలు, దివ్యాంగులతో ముచ్చటించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ అందుతుందా? లేదా ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అంటూ వారితో ఆప్యాయంగా కొద్దిసేపు మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు తమకు ప్రతి నెల ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటి వద్దే పెన్షన్ అందిస్తున్నారని తెలిపారు.

**అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయి..**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ డోర్ డెలివరీ చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా అవ్వాతాతలకు ఇంటి వద్దనే పెన్షన్ అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. రోజుల తరబడి పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. పెన్షన్ కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారన్నారు. తమ ప్రభుత్వంలో ఎంతో ఇంటి వద్దనే పెన్షన్ అందిస్తుండడంతో అవ్వా తాతలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి ఒక్క పథకం లబ్ధిదారులకు నేరుగా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. లంచాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే నగదు జమ చేయడం దేశంలో ఎక్కడా లేదన్నారు. పాలనలో సంస్కరణలు తీసుకువచ్చి ప్రజారంజకంగా పాలన సాగిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు ఇవ్వాలని కోరారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందని, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల అభ్యున్నతికి సీఎం జగన్ విశేష కృషి



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అవినాష్, వేదికపై ఎమ్మెల్యే వెలంపల్లి, నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆర్యవైశ్యుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్, సెంట్రల్ అభ్యర్థి, పశ్చిమ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కృష్ణలంక, బస్టాండ్ సమీపంలోని నక్షత్ర కన్వెన్షన్‌లో ఆదివారం తూర్పు నియోజకవర్గ ఆర్యవైశ్య కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య కుటుంబ సభ్యులందరినీ కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్య వైశ్యులకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఆర్యవైశ్యులకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యత కల్పించి అనేక పదవులు, దేవాలయాల కమిటీల్లో స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈబీసీ నేస్తం పథకం ద్వారా 45 ఏళ్లు నిండిన మహిళలకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. ఆర్యవైశ్యులకు మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా డెప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించి ఆర్య వైశ్య సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక గౌరవం ఇచ్చారన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఆర్యవైశ్యులకు అన్నివిధాలుగా న్యాయం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి తీసుకొనే ప్రతి నిర్ణయంలో ఎమ్మెల్యే వెలంపల్లి సలహాలు, సూచనలు ఉంటాయని అవినాష్ చెప్పారు. మంత్రిగా ఉన్నప్పుడు తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించిన వెలంపల్లికి ధన్యవాదాలు తెలిపారు. నగరంలో వ్యాపారం స్వేచ్ఛగా, సజావుగా చేసుకునేందుకు ఆర్యవైశ్యులకు తాము ఎల్లప్పుడూ అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో మీ బిడ్డగా తనను ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా దేవినేని అవినాష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి కూడా చేయలేని పనులు అవినాష్ ఈ ఐదేళ్లలో చేసి చూపించారన్నారు. కృష్ణలంక వాసుల వరద ముంపు కష్టాలను పరిష్కరించిన ఘనత అవినాష్‌దేనన్నారు. రిటైనింగ్ వాల్ దగ్గర పార్క్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్యే కాకుండానే ఇంత చేసిన అవినాష్‌కు మనమంతా అండగా నిలిచి మద్దతు ఇవ్వాలని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇంకెంత చేస్తాడో ఆలోచించాలన్నారు. ఆర్యవైశ్య సంఘం నగర అధ్యక్షుడు కొండపల్లి బుజ్జి, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, సంఘం సభ్యులు శేగు వెంకటేశ్వరరావు, సురేష్, పచ్చిపులుసు సాయిబాబు, బ్రహ్మం, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రమణయ్య, శేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## 20న అన్నమయ్య సంకీర్తనాగాన రవళి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో ఈ నెల 20వ తేదీన అన్నమయ్య సంకీర్తనా గాన ప్రచార భక్త బృందం ఆధ్వర్యాన అన్నమయ్య సంకీర్తనా గాన రవళి నిర్వహించనున్నట్లు పప్పు సదాశివశాస్త్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా బహుళసప్తమి మిగులు, శుద్ధ ఏకాదశి తిథులలో ఒక్కొక్క దేవాలయంలో అన్నమయ్య సంకీర్తనా గాన రవళి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు సంకీర్తన గాన రవళిని వీనులవిందుగా విని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు తెలిపారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే, పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద అమర గాయకుడు ఘంటసాల శత జయంతి వేడుకల ముగింపు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించాయి. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయస్థాయి గుర్తింపు తీసుకొచ్చిన మహనీయుడు ఘంటసాల అని చెప్పారు. ప్రభుత్వం కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ పాటల పూలతోటలో విరబూసిన మధుర స్వరం ఘంటల వెంకటేశ్వరరావు అని అభివర్ణించారు. కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, ప్రసూనా రామన్ ఘంటసాల సంగీత సేవలను వివరించారు. మల్లాది స్వాతి, మాధవి, మీనాకుమారి, మల్లీశ్వరి, రోజాలక్ష్మి, శేషగిరిరావు, కుమార్ గుప్తా, డేవిడ్‌రాజు, ప్రిన్స్ ఘంటసాల, క్లాసికల్ గీతాలను ఆలపించారు.

## ధార్మిక చింతన, క్రమశిక్షణకు ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఆసిఫ్, కార్పొరేటర్ రెహమతున్నీసా, హయాత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ధార్మిక చింతన, క్రమశిక్షణకు ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మస్జిద్‌లో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం ఇఫ్తార్ విందు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఇస్లాంలో రంజాన్ మాసానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. రంజాన్ మాసంలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిందని తెలిపారు. సమాజంలోని పేద, ధనిక వర్గాల మధ్య అంతరం లేకుండా అందరూ సమానమేనని రంజాన్ పండుగ వివరిస్తుందన్నారు. రంజాన్ మాసంలో చేసే ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమం వలన అల్లాహ అనుగ్రహానికి పాత్రులవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, అర్షద్, తాజ్ మస్జిద్ సెక్రటరీ షంషుద్దీన్, నాయకులు ఎస్‌కే నజీర్, బాజీ బాబా, రవూఫ్, సర్దార్ జానీ, ముజీబ్, జాహిద్, హమీద్, గౌస్, నయీమ్, ఎస్‌కే జిలాని, అస్గర్ పాల్గొన్నారు.

## దాహార్తి తీర్చడం ఉత్తమ సేవ



మజ్జిగ పంపిణీ చేస్తున్న హజరతయ్య గుప్తా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో బాటసారుల, పాదచారుల దాహార్తి తీర్చడమే కాకుండా బ్రెడ్ కూడా ఇవ్వడం ఒక చక్కని సేవా కార్యక్రమం అని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు హజరతయ్య గుప్తా అన్నారు. ఆదివారం వాసవీ క్లబ్ విజయవాడ ఈస్ట్ కపుల్స్ ఆధ్వర్యంలో స్వర్ణ ప్యాలెస్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పాదచారులకు మజ్జిగ, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సేవా సంస్థ, ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రతి మనిషి సమాజసేవకి అంకితం అయితే అందరికీ మేలు చేకూరుతుందని చెప్పారు. మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షరాలు విజయలక్ష్మి, గణేష్, రామచంద్ర రాజా, సాయిసునీత, ప్రభాకరరావు, శుభశ్రీ పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయి సేవాసమితి వార్షికోత్సవం

పెనమలూరు: పెనమలూరులో ఆదివారం సత్యసాయి సేవా సమితి 23వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 63 మంది మహిళలు సామూహిక సత్యసాయి వ్రతం చేశారు. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ సత్యసాయి సమితి జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ నాగప్రసాద్, వివిధ ప్రాంతాల కన్వీనర్లు వి.మోహన్‌రావు, బి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, మెండు భాస్కరరావు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్విజ్ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు నాట్యంలో శిక్షణ నిచ్చి మెలకువలు నేర్పించారు. నీతి కథలు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు వంటి పుస్తకాలు చదివించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలకు గ్రంథాలయాధికారి రమాదేవి బహుమతులు అందజేశారు.

## సజావుగా గ్రూప్‌-1 స్క్రీనింగ్ పరీక్ష

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్‌-1 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరిగాయి. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే వారిని కేంద్రాల్లోకి అనుమతించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అధికారులు సమన్వయంతో పరీక్షను విజయవంతం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



